సాక్షి
మంచిర్యాల

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



రైళ్ల ఆలస్యానికి చెక్ 8లో▸

రైళ్ల ఆలస్యానికి చెక్ పడనుంది. ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను దక్షిణ మధ్య రైల్వే శాఖ అందుబాటులోకి తెస్తోంది. మందమర్రి-రామగుండం లైన్‌లో అమలు చేయనుంది.



గోదావరిలో పెరుగుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నది తీరంలో స్నాన ఘట్టాల వద్దకు భక్తులను అనుమతించడం లేదు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /25.0

చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

వాస్తు శిల్పి పితామహుడు విశ్వకర్మ

- ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు



నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: వాస్తు శిల్పి, ప్రతిమ శాస్త్ర పితామహుడు విరాట్ విశ్వకర్మ అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఏ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం, విజయ్‌కుమార్, రమేష్, కస్తూరి శ్రీనాథ్‌చారి, రావుల హరీష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు విజయవంతం చేయండి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ, సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్‌లో రెండ్రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సు విజయవంతం చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్ అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలను సందర్శించిన సందర్భంగా సదస్సు కరపత్రాలను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కళాశాల యాజమాన్యం సమస్యలు, ప్రస్తుత అవసరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఐరన్ మ్యాన్స్ విజినరీ లీడర్‌షిప్ లిబరేషన్ ఆఫ్ హైదరాబాద్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే.కిషన్ ఓజా, సెమినార్ కన్వీనర్ డాక్టర్ కే.రాజయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నరేందర్‌రెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.గంగయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ గోపాలకృష్ణ, ఎన్‌సీసీ కమాండర్ జాడి మహేష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా విమోచన దినోత్సవం



రక్తదానం చేస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాలటౌన్/చెన్నూర్: మంచిర్యాల, చెన్నూర్‌లోని బీజేపీ కార్యాలయాల్లో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తాకట్టు పెట్టిన గొప్ప పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తామని అన్నారు. చెన్నూర్‌లోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు దుర్గం అశోక్, జోగుల శ్రీదేవి, కమలాకర్‌రావు, పట్టి వెంకటకృష్ణ, తుమ్మ శ్రీపాల్, నాయకులు పాల్గొన్నారు.

టీజీఈజేఏసీ పోరాటంతోనే జీవో 190



మాట్లాడుతున్న టీజీఈజేఏసీ నాయకులు

మంచిర్యాలటౌన్: టీజీఈజేఏసీ నిరంతర పోరాటం వల్లనే జీవో 317 బాధితులకు డిప్యూటేషన్/ట్రాన్స్‌ఫర్ జీవో 190ని ప్రభుత్వం విడుదల చేసిందని చైర్మన్ గడియారం శ్రీహరి అన్నారు. స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. 317 జీవో బాధితులకు ఊరటనిచ్చేలా జీవో ఇచ్చిన సీఎం, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. సెక్రెటరీ కె.వనజారెడ్డి, భూముల రామ్మోహన్, పొన్న మల్లయ్య, జాడి రాంకుమార్, యూసఫ్, నాగుల గోపాల్, వెంకటస్వామి పాల్గొన్నారు.

అనతికాలంలోనే అభివృద్ధి

- ప్రజలకు చేరువైన సంక్షేమ పథకాలు • రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు • ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



జెండాకు వందనం చేస్తున్న వేణుగోపాల్‌రావు



విద్యార్థినికి పరీక్ష ప్యాడ్ అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: అనతికాలంలోనే జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దార్శనిక పాలనలో విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి కల్పన, అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్ని రంగాల్లో తెలంగాణ గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

రేషన్‌కార్డులు పంపిణీ

జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు 26,510 నూతన రేషన్‌కార్డులు అందించడంతోపాటు 60,790మంది పేర్లు చేర్చాం. జిల్లాలో 2,47,923 మంది కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. పోర్టబులిటీ విధానం ద్వారా ఏ ప్రాంతంలోనైనా రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకునే వీలు కలిగింది.

రైతులకు రుణమాఫీ

రాష్ట్రంలో 25.35లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు రుణమాఫీ చేసి దేశంలో ఏ రాష్ట్రం చేయని సాహసం మన రాష్ట్రం చేసి చరిత్ర సృష్టించింది. రైతుల విషయంలో రాజీలేని రుణవిముక్తులను చేసి అత్యధికంగా పంట పండించే దిశగా ప్రోత్సహిస్తోంది. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12వేలు పెట్టుబడి సాయం, పరిమితి లేకుండా అందించాం. జిల్లాలో వానాకాలం పంటకు 1,52,162 మంది రైతులకు రూ.198.13 కోట్లు అందించాం. రైతు బీమా పథకం కింద 83,114మంది రైతులను చేర్చి ఇప్పటివరకు 347మంది కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ.17.35కోట్లు అందజేశాం. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేసి సన్నరకానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం.

ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన నిరుపేదలను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చి మొదటి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసి శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 10,503 ఇళ్లు మంజూరు కాగా, 6,682 గ్రౌండింగ్, 3,464 బేస్‌మెంట్, 400 గోడలు, 107 స్లాబ్ నిర్మాణ స్థాయిలో ఉన్నాయి. లబ్ధిదారుల ఖాతాలో రూ.33.39 కోట్లు జమ చేశాం.

రాజీవ్ ఆరోగ్యశ్రీ

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వవైభవం తెచ్చేందుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. జిల్లాలో 28,280 మంది పేదలు చికిత్స పొందారు. ఇందుకు గాను రూ.63.71 కోట్లు ఖర్చు చేశాం.

మహాలక్ష్మీ పథకం

మహాలక్ష్మీ పథకం కింద ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాం. జిల్లాలో 2.36 కోట్ల మంది మహిళలకు రూ.85.83 కోట్లు లబ్ధి చేకూరింది. రూ.500కే వంటగ్యాస్ సరఫరా ద్వారా మహిళలపై పడే ఆర్థిక భారం తగ్గించి, జిల్లాలో 1,22,837 మంది లబ్ధిదారులకు రూ.14.63 లక్షలు రాయితీ మంజూరు చేశాం.

మున్సిపాలిటీలు

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు ఐదు మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అంతర్గత రోడ్లు, వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ సిస్టం, పబ్లిక్ టాయిలెట్స్, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. మంచిర్యాలలో రూ.10.22 కోట్ల వ్యయంతో అత్యుత్తమంగా మహా ప్రస్థానం నిర్మించాం. అమృత్ 2.0 పథకం కింద అన్ని మున్సిపాలిటీలకు రూ.275 కోట్లు మంజూరు చేసి పురోగతిలో ఉన్నాయి.

గృహజ్యోతి..

200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా ప్రతీ నెల లక్ష నివాసాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ ఇప్పటివరకు 1,26,358 మంది వినియోగదారులకు రూ.81.50 కోట్లు లబ్ధి చేకూర్చాం.

భూభారతి

భూభారతి నూతన చట్టంపై ప్రతీ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. 51,503 దరఖాస్తులు రాగా 26,744 అంగీకరించి పరిశీలనలో ఉన్నాయి. గ్రామస్థాయిలో పరిపాలన సౌలభ్యం కోసం 168 క్లస్టర్లకు గ్రామ పాలన అధికారులను నియమించాం.

చేరువైన వైద్యం..

జిల్లాలో ప్రజలకు వైద్య సదుపాయం అందుబాటులోకి వస్తోంది. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణం, నర్సింగ్ కళాశాల భవనానికి రూ.40 కోట్లు మంజూరు చేయగా పనులు సాగుతున్నాయి. గుడిపేటలో రూ.216 కోట్ల వ్యయంతో అధునాతన వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోంది.

విద్యారంగం బలోపేతం

జిల్లాలో 510 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసి మిగతా పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల విద్యార్థులకు గతంలో ఎన్నడూ లేని విధంగా 40శాతం డైట్, 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచి నూతన మెనూ అమలు చేస్తూ, సకాలంలో పౌష్టికాహారం అందించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి జిల్లాలోని దండేపల్లి మండలం రెబ్బెనపల్లి, చెన్నూర్ మండలం సోమనపల్లి, బెల్లంపల్లి పట్టణంలో ఏర్పాటు చేస్తున్నాం. హాజీపూర్, దండేపల్లి, కన్నెపల్లి, వేమనపల్లి, కోటపల్లి మండలాల్లో కేజీబీవీలను ఇంటర్మీడియెట్ కళాశాలలుగా నవీకరించాం.

- జిల్లాలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి, రోడ్డు, రైలు రవాణా వ్యవస్థ, నీటి పారుదల, ఖనిజ వనరులు జిల్లా అభివృద్ధిలో ప్రత్యేక భూమిక పోషిస్తున్నాయి. గూడెం సత్యనారాయణస్వామి, వేలాల రాజరాజేశ్వరస్వామి ఆలయాలు, ఎల్లంపల్లి జలాశయం, కవ్వాల్ అభయారణ్యం, గాంధారి ఖిల్లా, గాంధారి వనం పర్యటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీసీపీ ఎగ్గడి భాస్కర్, అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్

చెన్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో అనితతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన స్త్రీ.. శక్తివంతమైన కుటుంబం కోసం జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు మహిళలు, యువతులు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పర్యవేక్షకులు కోటేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి రౌఫూఫ్‌ఖాన్, వైద్యులు సత్యనారాయణ, ప్రసాద్, కృపాబాయి, భీష్మ, శ్రీధర్, సుధాకర్‌నాయక్, హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఈఎంటీలకు అవార్డులు

చెన్నూర్ 108 అంబులెన్స్ ఈఎంటీ పోచన్న, వేమనపల్లి ఈఎంటీ జాడి స్వరూప, మంచిర్యాల 102 సర్వీసులో పని చేస్తున్న కెప్టెన్ శంకర్‌లకు బుధవారం చెన్నూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉత్తమ అవార్డులు అందజేశారు. రాష్ట్రంలోనే 108 సేవల్లో చెన్నూర్, వేమనపల్లి మండలాలు ప్రథమ స్థానంలో నిలిచాయని కలెక్టర్ తెలిపారు. అవార్డులు అందుకున్న ఈఎంటీలను రాష్ట్ర 108 కార్యాలయ ప్రధానాధికారి కిశోర్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల కార్యనిర్వాహణాధికారి సంపత్, వైద్యులు అభినందించారు.

ప్రబలుతున్న డెంగీ జ్వరాలు



చెన్నూర్ లైన్‌గడ్డలో ఆవాసాల పక్కనే కంపుకొడుతున్న డ్రెయినేజీ

- వర్షాలతో దోమలు వృద్ధి
- పెరుగుతున్న కేసుల సంఖ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రాంతంలో డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పంజా విసురుతున్నాయి. పారిశుద్ధ్యం లోపించి, వర్షాలతో నీరు స్థిరంగా నిలిచి దోమలు వృద్ధి చెందడం వల్ల జ్వరాలు వ్యాపిస్తున్నాయి. గత రెండు నెలలో వ్యవధిలో నిర్వహించిన డెంగీ ర్యాపిడ్ టెస్టులో 28మందికి పాజిటివ్ రాగా, మరో 25మంది మలేరియా బారిన పడ్డట్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్త పరీక్షలు చేయించుకోగా బయటపడిన కేసులు కాగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారి సంఖ్య ఇంతకు రెట్టింపుగా ఉన్నట్లు తెలుస్తోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్‌సెంటర్, బస్తీ దవాఖానాలు ఉన్నాయి. వర్షాకాలంలో ప్రబలే డెంగీ, మలేరియా జ్వరాలపై ప్రజలకు కనీస అవగాహన కల్పించకపోవడం, ముందస్తు చర్యలపై శ్రద్ధ వహించకపోవడం వల్ల వ్యాధులు విజృంభిస్తున్నట్లు తెలుస్తోంది.

వైద్య శిబిరాలపై నిర్లక్ష్యం

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రికార్డు అవుతున్న డెంగీ, మలేరియా జ్వరాల గణాంకాల ప్రకారం ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గత జూలైలో బెల్లంపల్లి టేకులబస్తీలో ఓ చిన్నారికి డెంగీ పాజిటివ్ రాగా బస్తీలో వైద్య శిబిరం నిర్వహించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇతర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జ్వరాల కేసులు

నెల	డెంగీ ర్యాపిడ్ పాజిటివ్	మలేరియా
జూలై	17	15
ఆగస్టు	10	6
సెప్టెంబర్	1	4 (15వ వరకు)

భయభ్రాంతులకు గురికావద్దు

వర్షాలు విస్తారంగా కురుస్తుండడం వల్ల ఇళ్లు, పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, టైర్లు, డ్రమ్ములు, కూలర్లలో దోమలు వృద్ధి చెంది జ్వరాల వ్యాప్తికి కారణమవుతాయి. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డెంగీ పాజిటివ్ నిర్ధారణ జరిగితే వెంటనే ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దు.

– డాక్టర్ సుధాకర్‌నాయక్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ, బెల్లంపల్లి

చెన్నూర్‌లోనూ బాధితులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణ ప్రజలు మొన్నటి వరకు వైరల్ ఫీవర్‌తో ఇబ్బంది పడగా.. ప్రస్తుతం డెంగీ ఫీవర్ వణికిస్తోంది. గత పక్షం రోజులుగా జ్వరాల బారిన పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని లైన్‌గడ్డ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరితోపాటు మరో కుటుంబానికి చెందిన ఒకరికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిసింది. ముగ్గురు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వర్షాకాలంలో దోమల నివారణ చేపట్టాల్సిన అధికారులు నామమాత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులిపేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారు. చెత్తకుప్పలు కుళ్లిపోతున్నా తొలగించడం లేదు.

దళితవాడలను పట్టించుకోరు



కాలనీలో మురికి కాలువలు నిండి కంపుకొడుతున్నా, ముళ్ల పొదలు పెరిగి దోమలు విజృంభిస్తున్నా పట్టించుకున్న నాథుడే లేరు. మెయిన్ రోడ్లలో డ్రైనేజీలు శుభ్రం చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. దళితవాడలను పట్టించుకున్న పాపాన పోలేదు. దళితవాడల్లో దోమల నివారణ చర్యలు చేపట్టి రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

– తగరం అశోక్, ఇందిరనగర్ కాలనీ

చెత్త తీసేటోళ్లు లేరు..



కాలనీల్లో చెత్త తీసేటోళ్లు వస్తలేరు. గతంలో ప్రతీరోజు చెత్త బండ్లు వచ్చేవి. ఆరు నెలల నుంచి వారానికి ఒక్క రోజు వచ్చిన దాఖలాలు లేవు. చెత్త తీయకపోవడంతో వర్షాలకు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. పన్నుల వసూలుకు వత్తుండ్లు. ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తలేరు. అధికారులు స్పందించి కాలనీలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలి.

– ఎస్‌డీ.జాకీర్, లైన్‌గడ్డ

యూరియా కోసం ఆందోళన

వేమనపల్లి: యూరియా కోసం నీల్వాయిలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు బారులు తీరారు. 660 యూరియా బస్తాలు రాగా ఏఓ వీరన్న రైతులకు ఒక్కో బస్తా పంపిణీ చేశారు. ఏడుగురు రైతులకు కూపన్లు ఇచ్చిన యూరియా బస్తాలు లేకపోవడంతో ఆందోళనకు దిగారు. రెండు రోజుల్లో మళ్లీ యూరియా వస్తుందని, అందజేస్తామని అధికారులు చెప్పడంతో శాంతించారు. ఎస్సై కోటేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యవసాయాధికారి పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి పీఏసీఎస్‌లో రైతులకు విక్రయిస్తున్న యూరియా నిల్వలను జిల్లా వ్యవసాయాధికారి సురేఖ పరిశీలించారు. రైతులకు సక్రమంగా యూరియా పంపిణీ చేయాలని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మామిడి కృష్ణ, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్, ఏఓ కృష్ణ పాల్గొన్నారు.



పంపిణీని పర్యవేక్షిస్తున్న సురేఖ

అపోహలను తొలగించే జానపద ప్రచారాలు

చెన్నూర్: జానపద ప్రచారాలు అపోహలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తాయని డీఎంహెచ్‌వో అనిత అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ఎస్ఎన్ఎస్‌పీఏ కార్యక్రమంలో భాగంగా బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్ కోసం సమీకృత వ్యూహం, అవగాహన సదస్సు నిర్వహించారు. జానపద కళాకారులు పాటల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ సాంప్రదాయ జానపద మీడియా ద్వారా నృత్యం, కళారూపాలను వినియోగించి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. పీవో సుధాకర్ నాయక్ మాట్లాడుతూ మొబైల్ పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలపై జానపద పదర్శనలతో పూర్తి సమాచారాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జానపద కళాకారులు, రోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అనిత

ఘనంగా సాయుధ పోరాట వార్షికోత్సవం

రామకృష్ణాపూర్: తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం ఆనాడు అసలు సిసలైన పోరాటాలు సాగించిన అమరవీరులకు నివాళులర్పిస్తూ వారిని స్మరించుకునేందుకు సాయుధ పోరాట దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని పలు ప్రధానకూడళ్లలోనూ జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపెల్లి శ్రీనివాస్, గోపి, ఇప్పకాయల లింగయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీతారామయ్య

రేపు బోధన అభ్యసన మేళా

మంచిర్యాలఅర్బన్: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న జిల్లా స్థాయి బోధన అభ్యసన మేళా(టీఎల్ఎం మేళా) నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈ నెల 20న నిర్వహించాల్సిన మేళాను 19కు మార్చినట్లు తెలిపారు. ప్రతీ మండలం నుంచి ఎంపికైన టీఎల్ఎమ్ ప్రదర్శనలు తీసుకుని ఉదయం 9గంటలకు సంబంధిత ఉపాధ్యాయులందరూ రావాలని సూచించారు. మొత్తం ప్రదర్శనల్లో ఎనిమిది అత్యుత్తమమైన వాటిని రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎడమవైపు వరద ప్రభావిత ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై గోపి తెలిపారు. మృతునికి 46 సంవత్సరాల వరకు ఉండవచ్చని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందన్నారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు 8712659520, 8712659519 నంబర్లలో సంప్రదించాలన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుతదాడిలో మేక హతం

తానూరు: మండలంలోని హిప్నెల్లి శివారులో బుధవారం మధ్యాహ్నం మేకపై చిరుతదాడి చేసిన ఘటనలో మేక హతమైంది. మేకల కాపరులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని అటవీ ప్రాతంలో మేకలను మేపుతుండగా మేకపై చిరుత దాడిచేసి హతమార్చింది. గ్రామస్తులు విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయమై బీట్ అధికారి కృష్ణను వివరణ కోరగా హిప్నెల్లి గ్రామం నుంచి సమాచారం అందిందని ఘటన స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

రాయితీ సిలిండర్లు పట్టివేత



సిలిండర్లతో అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వినియోగిస్తున్న రాయితీ సిలిండర్లను పట్టుకున్నట్లు ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు రాజ్‌కుమార్, శ్రీనివాస్ బుధవారం తెలిపారు. వాంకిడి మండల కేంద్రంలోని తెలంగాణ హోటల్, నేచర్ టీ స్టాల్, రియాజుద్దీన్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, ఫ్రెండ్స్ విల్లా ఫాస్ట్ ఫుడ్ సెంటర్, పాడ్యావర్చా చాహా టీ స్టాల్‌లో తనిఖీలు చేపట్టి గృహ వినియోగ రాయితీ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడ్డ తిరుపతి

భీమారం: మండలంలోని మాంతమ్మ సమీపంలో చెన్నూరు–మంచిర్యాల జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో టేకుమట్ల గ్రామాకిని చెందిన తిరుపతి తీవ్రంగా గాయపడ్డాడు. టేకుమట్ల నుంచి చెన్నూరుకు మోటారుసైకిల్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మాంతమ్మ ఆలయం సమీపంలో మోటారుసైకిల్ అదుపుతప్పి పడిపోయాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు ఆత్మహత్య

తలమడుగు: కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన కంది సత్తమ్మ (65) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రిలో వైద్యం అందించినా నయం కాకపోవడంతో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుమారుడు నవీన్, కోడలు ఇంటికి వచ్చి చూసే సరికి దూలానికి వేలాడుతూ కనిపించింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

వాగులో మృతదేహం లభ్యం



వాగులో లభ్యమైన ఆనంద్‌రావు మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బాబాపూర్ పంచాయతీ పరిధి రాజులగూడ వాగులో బుధవారం తెల్లవారుజామున ఓ మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మెస్రం ఆనంద్‌రావు (47) ఈ నెల 13న నిత్యావసర వస్తువులు తీసుకువస్తానని ఇంటి నుంచి బయలుదేరాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. బుధవారం రాజులగూడ వాగులో ఓ పశువుల కాపరి కుళ్లిన శవం చెట్ల కొమ్మల మధ్య కనిపించిందని స్థానికులకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఆనంద్‌రావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆనంద్‌రావుగా గుర్తించారు. మృతుడి భార్య సీతాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్తీ కల్లు విక్రయించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ గౌడ్ కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కల్తీ కల్లు అమ్ముతున్నట్లు గుర్తించారు. గతంలో పలుమార్లు హెచ్చరించి కేసు నమోదు చేసినా తీరు మారకపోవడంతో తహసీల్దార్ రాజీమోహన్ ఎదుట బైండోవర్ చేసి రూ.లక్ష జరిమానా విధించారు.

వీడని జంట మరణాల మిస్టరీ..!

- ఇద్దరిని విచారించిన పోలీసులు
- అయినా కొలిక్కి రాని కేసు
- పోస్టుమార్టం నివేదికనే ఆధారమా..?



మృతులు సత్యవతి, గీతశిరీష(ఫైల్)



గీతశిరీష మృతదేహం రంగు మారిన దృశ్యం(ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాలో సంచలనం సృష్టించిన నానమ్మ, మనవరాలి అనుమానాస్పద మృతి మిస్టరీ వీడలేదు. పోలీసులు పలు కోణాల్లో విచారణ చేస్తున్నా కొలిక్కి రావడం లేదని తెలిసింది. పోస్టుమార్టం నివేదిక వస్తేనే మరణాలకు కారణం ఏమిటనేది తెలిసే అవకాశం ఉంది. మంచిర్యాలలోని గోపాలవాడ శివారు రైల్వే ఏ క్యాబిన్ వద్ద ఓ ఇంట్లో ఖమ్మంలోని 3వ టౌన్ ప్రాంతానికి చెందిన బెజ్జాల సత్యవతి(55), ఆమె మనవరాలు గీతశిరీష(4) ఈ నెల 10న మృతిచెందిన విషయం తెలిసిందే. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను విచారించినట్లు సమాచారం.

ఇల్లు అమ్మడానికి వచ్చి..

ఖమ్మంలోని 3టౌన్ ప్రాంతానికి చెందిన బెజ్జాల చంద్రయ్య, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు గంగోత్రి, ట్రాన్స్‌జెండర్‌గా మారిన శిరీష ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ శిరీష రైల్వే ఏ క్యాబిన్ వద్ద ఇల్లు నిర్మించుకుంది. 2022 జనవరి 4న అనుమానాస్పద స్థితిలో ఇదే ఇంట్లో చనిపోయింది. కుటుంబ సభ్యులు తరచూ వచ్చి వెళ్తుండేవారు. ఈ క్రమంలో స్థానిక ఉండే ఓ ఆర్‌ఎంపీతో సత్యవతి కుటుంబ సభ్యులకు పరిచయం ఏర్పడింది. సత్యవతి ఆర్‌ఎంపీతో కాస్త చనువుగా ఉండేదని, ఇంటి మరమ్మతులకు రూ.50వేలు ఇంట్లో ఎవరికీ తెలియకుండా అప్పుగా ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంలో ఆరు నెలల క్రితం ఆర్‌ఎంపీతో సత్యవతి భర్త చంద్రయ్యకు మధ్య గొడవ జరిగింది. ట్రాన్స్‌జెండర్ శిరీష ఇంటిని కొనడానికి పార్టీ సిద్ధంగా ఉందంటూ ఆర్‌ఎంపీ పిలిపించడంతో ఈ నెల 8న సత్యవతి, కుమారుడు గంగోత్రి, ఇతడి కూతురు గీతశిరీష కలిసి వచ్చారు. వచ్చిన రోజు ఆర్‌ఎంపీ స్పందించకపోవడంతో మరుసటి రోజు సత్యవతి, గీతశిరీష ఇక్కడే ఉండగా.. గంగోత్రి వెళ్లిపోయాడు. సాయంత్రం సత్యవతి తన కుమారుడు గంగోత్రికి ఫోన్ చేసి తనకు పాపకు విరేచనాలు, వాంతులు అవుతాయని చెప్పింది. 10న తెల్లవారే సరికి ఇద్దరూ మృతిచెంది ఉండడం కలకలం రేపింది.

అన్నీ అనుమానాలే..!

సత్యవతి, గీతశిరీష ఎలా మృతిచెందారు..? హత్య, ఆత్మహత్యా..? ఒకవేళ ఆత్మహత్య అయితే కారణాలు ఏంటి.. హత్య అయితే ఎవరు చేసి ఉంటారు.. ఎందుకు.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన స్థలంలో తెల్లకల్లు ప్లాస్టిక్ బాటిల్, పాల డబ్బా, వాటర్ బాటిల్, వండుకున్న ఎగ్ కర్రీ, వైట్ రైస్, ఛాయ్ లభించడంతో పోలీసులు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. సత్యవతికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒక వేళ ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తే ఏ పాపం తెలియని పసిపాప శిరీష ఏం చేసింది. వాంతులు, విరేచనాలు తగ్గేందుకు స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీని సంప్రదిస్తే ఇద్దరికీ వైద్యం అందించాడా..? ఒకవేళ అదే జరిగితే వైద్యం వికటించిందా..? లేదా రాత్రి వంట చేసుకొని తిన్నారు. సత్యవతి తెల్ల కల్లు తాగింది. కల్లులో గానీ ఎగ్ కర్రీలో గానీ ఎవరైన విష పదార్థాలు కలిపారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా ఫుడ్ పాయిజన్ అయినా కావాలి. విష ప్రయోగమైనా జరిగి ఉండాలి. వైద్యం వికటించి అయినా జరగాలి. గీతశిరీష మృతదేహం రంగు మారడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా పోస్టుమార్టం నివేదికపై ఆధారపడి ఉందని పోలీసులు చెబుతున్నారు.

గోదావరిలో పెరుగుతున్న వరద



ఓని–బాసర రహదారి



బాసర వద్ద గోదావరి నది ప్రవాహం

బాసర: ఎగువన కురుస్తున్న వర్షాలకు బాసర వద్ద గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. మహారాష్ట్రలోని నాందేడ్ పర్భాని జిల్లా పరిధిలో వర్షాలు ఏకధాటిగా కురుస్తుండడంతో గోదావరినదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో నదీతీరంలోని స్నానఘట్టాల వద్దకు భక్తులను అనుమతించడం లేదు. ఆలయం నుంచి గోదావరి నదికి ఉండే మార్గంలో వరద నీరు వచ్చి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసుల, రెవెన్యూ అధికారులు గోదావరి నది వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

మళ్లీ వరదనీరు

బాసరలో 15 రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఓనీ, కౌట, సావర్గాం, సాలాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారులు గోదావరి బ్యాక్ వాటర్‌తో నిండి రాకపోకలు నిలిచిపోయాయి.

రేపు జీఎం కార్యాలయాల ముట్టడి



మాట్లాడుతున్న వీ.సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 19న కంపెనీ వ్యాప్తంగా జీఎం కార్యాలయాలు ముట్టడించనున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ ఓసీపీ గనులపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం, గుర్తింపు సంఘం మధ్య జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో కుదుర్చుకున్న ఒప్పందాలకు వెంటనే సర్క్యులర్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందాల అమలుపై ఉత్తర్వులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ 12న స్ట్రక్చరల్ సమావేశం బహిష్కరించినట్లు తెలిపారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, సంపత్, అద్దు శ్రీనివాస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ సెక్రెటరీ మోతె లచ్చన్న పాల్గొన్నారు.

'సింగరేణి భవిష్యత్ అంధకారం'

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరితో సంస్థ భవిష్యత్ అంధకారంలో పడిందని జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర గౌరవ సలహాదారులు టీ.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వేలంలో పాల్గొనకుండా బొగ్గు గనులను నేరుగా సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డీ.బ్రహ్మానందం, ఉపాధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, మేకల రామన్న, జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, అరుణ, ఓదెలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంను ఉట్నూర్ ఐటీడీఏలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పీవో ఖుష్బూ గుప్తా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకం ఆవిష్కరించారు. ముందుగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో త్యాగధనుల పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో డిగ్రీ కళాశాల, జూనియర్ కాలేజీ, హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో బుధవారం షీ టీమ్ ఎస్సై ఉషారాణి సిబ్బందితో కలిసి డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. ఐదుగురు ఆకతాయిలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మరోసారి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే నిర్భయంగా 100 డయల్, 6303923700 వాట్సాప్ నంబర్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- ఉమ్మడి జిల్లాలో 81 ఖాళీలు

ఆదిలాబాద్: ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి టీఎస్ఎల్‌పీఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి డ్రైవర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించింది. అక్టోబర్ 8 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం 81 పోస్టులు భర్తీకి నోచుకోనున్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. ఆదిలాబాద్ జిల్లాలో 21, మంచిర్యాలలో 24, నిర్మల్‌లో 21, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 15 పోస్టులు భర్తీ కానున్నాయి.

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి

ఆదిలాబాద్: ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలని ఎంపీ నగేశ్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి జోనల్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటేందుకు ప్రణాళికాబద్ధంగా సాధన చేయాలని సూచించారు. ఇందులో కోచ్ కబీర్‌దాస్ పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధికి చర్యలు

జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎంపీ అన్నారు. బుధవారం ఆయన స్టేడియంను సందర్శించారు. డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విడతల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ అన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 9, 11వ తరగతుల్లో చేరేందుకు అవకాశం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026– 27 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2025– 26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ 01– 05– 2011 నుంచి 31– 07– 2013 మధ్య జన్మించి ఉన్నవారు అర్హులని తెలిపారు. అలాగే 11వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లాలో 2025– 2026 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదువుతూ 01– 06– 2009 నుంచి 31– 07– 2011 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి చదువుతున్న, నివాసం ఉంటున్న జిల్లా ఒకటే అయినప్పుడు విద్యార్థి జిల్లాస్థాయి మెరిట్ కోసం పరిగణిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థి ఓపెన్, గ్రామీణ కోటా కింద పరిగణిస్తారని, పట్టణ ప్రాంత పాఠశాలల్లో విద్యార్థి అర్బన్ కోటా కింద పరిగణిస్తారని తెలిపారు. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, 2026 ఫిబ్రవరి 7న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు https:// www. navodaya. gov. in ద్వారా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన పత్తి రాజ్‌కుమార్ (33) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించగా చికిత్సపొందుతూ గోదావరిఖని ఆస్పత్రిలో బుధవారం మృతిచెందాడు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పని చేస్తూ జీవించే రాజ్‌కుమార్ కొన్ని రోజులుగా ఖాళీగా ఇంటి వద్ద ఉంటున్నాడు. పనికి వెళ్లాలని భార్య మానస, తల్లిదండ్రులు సూచించారు. ఇదే విషయంలో భార్యాభర్తల తరచూ గొడవలు జరిగేవి. గత నెల 20న భార్యతో గొడవపడి ఇంట్లో గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు. అక్కడి నుంచి మళ్లీ ఈ నెల 10న గోదావరిఖని ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య మానస, కూతురు శ్రీశ్వ, కుమారుడు శ్రీహాన్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై హబీబ్ తెలిపారు.

'కార్మికులను వేధిస్తున్న గని మేనేజర్'



అధికారితో మాట్లాడుతున్న నాయకులు

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–5 గనిలో ఇష్టానుసారంగా కార్మికులకు లెటర్లు పంపిణీ చేస్తూ గని మేనేజర్ వేధింపులకు గురిచేస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. బుధవారం కేకే–5 వద్దకు చేరుకున్న పలు కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టిన కార్మికులను కలుసుకుని వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం గని సేఫ్టీ ఆఫీసర్ రమేష్‌తో మాట్లాడగా గని మేనేజర్ అందుబాటులో లేరని, వచ్చాక మాట్లాడుదామని నచ్చజెప్పడంతో కార్మికులు యథావిధిగా విధుల్లోకి వెళ్లారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎమ్మెస్ నాయకులు పాల్గొన్నారు.

వాగుదాటి అంత్యక్రియలకు హాజరు



ఒకరినొకరు పట్టుకొని వాగు దాటుతున్న గిరిజనులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం మత్తడిసుంగుగూడ గ్రామానికి చెందిన కుమ్ర పారుబాయి (45) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బంధువులు గ్రామానికి వచ్చే క్రమంలో సమీపంలోని వాగు దాటాల్సి ఉంటుంది. అయితే వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్తులు, బంధువులు ఇలా ఒకరినొకరు చేయి పట్టుకొని దాటాల్సి వచ్చింది. ఏటా వర్షాకాలంలో తమకు వాగు ఇక్కట్లు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

- మహిళ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- యూరియా కోసం వెళ్తూ మృత్యుఒడికి..



నానక్క(ఫైల్)



సంఘటన స్థలంలో మారుతి, నానక్క

తాండూర్: మండలంలోని రేచిని–గోపాల్‌నగర్ మూలమలుపు వద్ద బుధవారం మోటార్‌సైకిల్‌ను స్కూల్‌బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్‌లోని సెయింట్ థెరిస్సా స్కూల్ బస్సు రెబ్బెన మండలం కిష్టాపూర్ గ్రామం నుంచి విద్యార్థులను తీసుకొస్తుండగా రేచిని–గోపాల్‌నగర్ మూలమలుపు వద్ద మోటార్‌సైకిల్‌ను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పోగుల నానక్క, పీరిట్ల మారుతి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నానక్క(40) పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులోని విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కొడుకును పాఠశాలకు పంపేందుకు వచ్చి..

పోగుల నానక్క తన కుమారుడు అన్విత్‌ను సెయింట్ థెరిస్సా పాఠశాలకు పంపేందుకు స్టేజీ వద్దకు వచ్చి బస్సు ఎక్కించి పంపించింది. ఇదే సమయంలో అదే గ్రామానికి చెందిన పీరిట్ల మారుతి యూరియా బస్తాల కోసం రేచినికి వెళ్తున్నాడు. విషయం తెలిసిన నానక్క తాను కూడా యూరియా కోసం వస్తానని మారుతి మోటార్‌సైకిల్‌పై వెళ్లింది. ఆ తర్వాత కొద్ది క్షణాల్లోనే బస్సు మృత్యు శకటమై ఢీకొట్టింది. నానక్కకు భర్త మల్లేష్, కుమారుడు ఉన్నారు.

పిల్లల ప్రాణాలతో చెలగాటం

సెయింట్ థెరిస్సా పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యపు పనితీరు, పర్యవేక్షణ లోపంతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్కూల్ బస్సు డ్రైవర్ డ్రంకెన్‌డ్రైవ్‌లో పోలీసులకు చిక్కాడు. మద్యం సేవించి బస్సు నడుపుతున్నా పట్టించుకోకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అనుమతి లేకుండా హాస్టల్ నిర్వహించినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

రైళ్ల ఆలస్యానికి చెక్..!

- ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు
- మందమర్రి–రామగుండం మార్గంలో పనులు


మందమర్రిరూరల్: బల్లార్ష–కాజీపేట సెక్షన్‌లోని మందమర్రి నుంచి రామగుండం వరకు 24కిలోమీటర్ల దూరం ట్రిపుల్ లైన్ రైల్వే మార్గంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 19న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల ప్రారంభానికి ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే కాజీపేట–బల్లార్ష సెక్షన్‌లోని హసన్‌పర్తి రోడ్డు నుంచి జమ్మికుంట రైల్వేస్టేషన్ల మధ్య 24కిలోమీటర్ల మేర దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల ఒకే మార్గంలో నడుస్తున్న రైళ్ల మధ్య దూరం ఒక కిలోమీటరు మాత్రమే తేడా ఉంటుంది. ఇంతకుముందు ఒకేమార్గంలో నడిచే రైళ్లు ఒక స్టేషన్ తేడాతో నడవాల్సి వచ్చేది. ఈ సెక్షన్‌లో పనులు చకచకా సాగుతుండగా త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తేవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యవస్థ వినియోగంలోకి వస్తే రైళ్ల రాకపోకల ఆలస్యాన్ని నివారించవచ్చని రైల్వే అధికారులుతెలిపారు.

పలు రైళ్లు రద్దు

ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనుల ప్రారంభం సందర్భంగా 19న పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. 19న 17003/04 రామగిరి ఎక్స్‌ప్రెస్, 17035/36 కాజీపేట–బల్లార్షా ఎక్స్‌ప్రెస్, కరీంనగర్–సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ పుష్పుల్ ప్యాసింజర్, రైళ్లను రద్దు చేశారు. 18న సికింద్రాబాద్ బయలుదేరే 17233 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, 19న సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరే 17234 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను సికింద్రాబాద్ నుంచి కాజీపేట వరకు నడుపుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌గర్ వరకు ఆ రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. 17033/34 సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలును భద్రాచలం రోడ్డు నుంచి వరంగల్ వరకు నడుపుతూ వరంగల్ నుంచి బల్లార్ష మధ్య పాక్షికంగా రద్దు చేయనున్నారు. 17011/12 హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బీదర్ వరకు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు మందమర్రి రైల్వేస్టేషన్‌లో 19న హాల్టింగ్ తొలగించారు. 17078 డెహ్రాడూన్ నుంచి చర్లపల్లి వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును అరగంట ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు ఒకరికి.. బిల్లు మరొకరికి

- పంచాయతీ కార్యదర్శి నిర్వాహకం
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన
- కలెక్టర్‌కు ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి..



పంచాయతీ కార్యదర్శి రాసిచ్చిన ఒప్పంద పత్రం

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇల్లు ఒకరికి మంజూరైతే పంచాయతీ కార్యదర్శి బిల్లు మరొకరికి అందజేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ముస్లే నందబాయి భర్త సంతోష్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. జూన్ 2న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే గ్రామంలో ముస్లే నందబాయి భర్త మారుతికి కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అయితే పంచాయతీ కార్యదర్శి సునీల్ నాయక్ నిర్వాకం వల్ల బేస్‌మెట్ వరకు నిర్మాణం పూర్తయిన నందబాయి (భర్త మారుతి)కి వచ్చే బిల్లు ఇంకా పనులు ప్రారంభించని నందబాయి (భర్త సంతోష్) బ్యాంకు ఖాతాలో రూ.లక్ష జమ అయ్యాయి. ఈ బిల్లు విషయంలో గ్రామంలో పక్షం రోజులుగా రెండు కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. కాగా, కార్యదర్శి తన తప్పు సరిదిద్దుకోవడానికి మరో తప్పు చేసి వివాదానికి తెరలేపాడు. డబ్బులు ఖాతాలో జమ కావాలంటే బ్యాంక్ వోచర్‌పై సంతకాలు పెట్టాల్సి ఉంటుందని నందబాయి, ఆమె భర్త సంతోష్‌ను ఇచ్చోడ బ్యాంక్‌కు పిలిపించాడు. ఈ నెల 3న వోచర్లపై సంతకాలు తీసుకొని ఆమె అకౌంట్‌లో జమ అయిన డబ్బులను నందబాయి భర్త మారుతి అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయించాడు. విషయం బయటకు పొక్కడంతో సంతోష్‌తో పాటు గ్రామస్తులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కార్యదర్శిని నిలదీశారు. దీంతో కార్యదర్శి తన తప్పు ఒప్పుకొని వారం రోజుల్లో నందబాయి భర్త సంతోష్‌కు రూ.లక్ష ఇస్తానని ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోవడంతో సంతోష్ రెండు రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఎంపీడీవో ఆనంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఇద్దరు లబ్ధిదారుల పేర్లు ఒకేలా ఉండటంతో ఒకరికి వచ్చే బిల్లు మరొకరి అకౌంట్‌లో జమ అయినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.